## క్లుప్తంగా

### అన్నవరప్పాడులో భక్తుల రద్దీ


పూలు, జామకాయల అలంకరణలో వేంకటేశ్వరస్వామి వారు

పెరవలి: కార్తిక శనివారం, శని త్రయోదశి కావడంతో మండలంలోని అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వర స్వామి వారిని వేలాదిగా భక్తులు దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పూలు, జామకాయలతో అలంకరించారు. భారీఎత్తున మహిళలు తెల్లవారు జామునే ఆలయానికి చేరుకుని, ఇక్కడి కోనేరులో కార్తిక దీపాలు వదిలారు. స్వామివారి అభిషేకం అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ఉదయం ఏడు గంటల తర్వాత భక్తుల రద్దీ మరింతగా పెరిగింది. దాంతో స్వామివారి దర్శనానికి సుమారు గంట సమయం పట్టింది. భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉదయం 10 గంటల నుంచి అన్న సమారాధాన చేపట్టారు. దాత నల్లిమిల్లి నాగబాబు అన్నదానాన్ని ప్రారంభించారు. సుమారు 6 వేల మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు.

### రేపు తాళ్లపూడిలో సామాజిక తనిఖీ ప్రజావేదిక

తాళ్లపూడి: ఉపాధి హామీ పథకం పనులపై మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకటరమణ శనివారం తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి జరిగే సమావేశంలో గతేడాది ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి నెలాఖరు వరకూ మండలంలో నిర్వహించిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహిస్తామన్నారు.

### వికసిత్ భారత్ సంకల్పయాత్ర టీబీ రోగులకు వరం


క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్న ఎంపీడీఓ రాజశేఖరం

నల్లజర్ల: వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్షయ రోగులకు వరం వంటిదని ఎంపీడీఓ రాజశేఖరం అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం నల్లజర్లలో క్షయ రోగులకు ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ లక్షణాలున్న వారిని పరీక్షించడంతో పాటు క్షయ అనుమానితుల నుంచి ప్రత్యేక బృందం కఫం సేకరించింది. క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరించాలని వైద్యాధికారి తెల్లం గంగాధరరావు కోరారు. దాతలు అందజేసిన పౌష్టికాహారం, కోడిగుడ్లను క్షయ రోగులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీపీ బంక జయలక్ష్మి, కారుమంచి రమేష్, మద్దిపాటి ప్రసాద్, బంక అప్పారావు, డాక్టరు సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ ప్రసాదరావు, కార్యక్రమ కో–ఆర్డినేటర్ సింహాద్రిరావు, టీబీ ట్రీట్‌మెంట్ సీనియర్ సూపర్‌వైజర్ గాలింకి ఆశాజ్యోతి, టి.భీమరాజు పాల్గొన్నారు.

### రైతులకు ఇచ్చిన హామీలను ప్రధాని నెరవేర్చాలి


దొండపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతుకూలీ సంఘ ప్రతినిధులు

గోపాలపురం: ఢిల్లీలో పోరాటం సాగించిన రైతులకు ఇచ్చిన హామీలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేయాలని రైతు కూలీ సంఘం డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో మండలంలోని దొండపూడి గ్రామంలో శనివారం రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతుకూలీ సంఘం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు షేక్ బాషా మాట్లాడారు. కనీస మద్దతు ధర చట్టాన్ని తీసుకురావాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 27, 28 తేదీల్లో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏజెన్సీ గిరిజన సంఘ కార్యదర్శి కుంజం రామారావు, నాయకులు సవలం రాంబాబు, ముప్పిడి రాజారత్నం, రైతు కూలీ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### గోప్యంగా కులగణన సర్వే వివరాలు

ఉండ్రాజవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న కులగణన సర్వే వివరాలను గోప్యంగా ఉంచుతారని తహసీల్దార్ జి.కనకరాజు చెప్పారు. కులగణన సర్వేపై శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయిలో అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఈ సర్వే వివరాల ఆధారంగా ఎవరికీ కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయడం గాని, సంక్షేమ పథకాలను తొలగించడం గాని చేయరన్నారు. ఎంపీడీవో జి.ఆర్‌కే రాజు సర్వే నిర్వహణ, ప్రజల వద్ద నుంచి వివరాలు సేకరించి ఆన్‌లైన్ యాప్‌లో ఎలా పొందుపరచాలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, డిప్యూటీ తహసీల్దార్ కె.పద్మావతి పాల్గొన్నారు.

# పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి

- హోం మంత్రి తానేటి వనిత
- ఆరికిరేవులు, చాగల్లు గ్రామాల్లో మంత్రి వనిత, సమిశ్రగూడెంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు గడప గడపకూ..


కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో ఓ కుటుంబానికి బ్రోచర్ అందజేస్తున్న హోం మంత్రి తానేటి వనిత


చాగల్లులో మంత్రిని సత్కరిస్తున్న నాయకులు, ఉద్యోగులు

కొవ్వూరు: వివిధ సంక్షేమ పథకాల ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చామని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని ఆరికిరేవుల గ్రామంలోను శనివారం రాత్రి ఆమె గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి మంత్రి వనిత ఇంటింటికీ వెళ్లారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, సర్పంచ్ మట్టా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చావా చినపాపారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభి రామారావు, ఉప సర్పంచ్ మల్లిపూడి వెంకట్రావు, పార్టీ నాయకులు చావా దామోదరరావు, మల్లిపూడి రాజేష్, యనమదల సూరిబాబు, రంబాల అన్నవరం, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సుంకర సత్యనారాయణ, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి వీరన్న, తాళ్లపూడి ఎంపీపీ జొన్న కూటి పోసిబాబు పాల్గొన్నారు.

**చాగల్లులో దిగ్విజయంగా ముగింపు**

చాగల్లు: శనివారం ఉదయం చాగల్లు–4 సచివాలయం పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత 166వ రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులతో కలసి మంత్రి ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక అందించిన సంక్షేమాన్ని, చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ప్రజా సమస్యలపై ఆరా తీశారు. కాగా శనివారంతో ఈ పంచాయతీ పరిధిలోని ఐదు సచివాలయాల పరిధిలోనూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. సచివాలయం భవనం వద్ద నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో మంత్రి పాల్గొన్నారు. భారీ కేక్ ను కట్ చేసి అందరికీ పంచారు. ఈ సందర్భంగా తానేటి వనితను పార్టీ నాయకులు, ఉద్యోగులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్కూరి దొరయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గంధ్రోతు సురేంద్రకుమార్, వైస్ ఎంపీపీ జుజ్జవరపు రామచంద్రరావు, పార్టీ మండల శాఖ గౌరవాధ్యక్ష, అధ్యక్షులు జుట్టా కొండలరావు, చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, ఉప సర్పంచ్ మేకా రాజు, మండల స్థాయి అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.


సమిశ్రగూడెంలో మహిళలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**జగనన్నను మళ్లీ సీఎం చేసుకుందాం**

నిడదవోలు రూరల్: పేదల సంక్షేమమే అజెండాగా సుపరిపాలన అందిస్తున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెం సచివాలయం–2 పరిధిలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్న ప్రియాంక, వైఎస్సార్ సీపీ గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్ ఆధ్వర్యంలో మూడో రోజు శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాలను వివరిస్తూ బుక్‌లెట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ గ్రామమైన సమిశ్రగూడెం అభివృద్ధిని గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుతం రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. ముస్లింల శ్మశానం అభివృద్ధికి రూ.4 లక్షలు మంజూరు చేశామన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి వచ్చిన మెజార్టీ కంటే ఈసారి మరింత ఎక్కువ రావాలని గ్రామస్తులను ఎమ్మెల్యే అభ్యర్థించారు. రేషన్ కార్డులు, పింఛన్ల వంటి స్థానికుల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, ఉప సర్పంచ్ గజ్జరపు నవరజిని, వైఎస్సార్ సీపీ నాయకులు కస్తూరి సాగర్, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, ఎస్‌కే సుబేదర్, రహీం తదితరులు పాల్గొన్నారు.

# జగన్ నిర్ణయంతో లంక రైతులకు మేలు

- నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- సి క్లాస్ భూములపై మల్లేశ్వరంలో 71 మంది రైతులకు లీజు పట్టాలు


మల్లేశ్వరంలో గోదావరి లంక రైతులకు ఐదేళ్ల లీజు పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు


నల్లజర్లలో అసైన్డ్ భూముల సాగుదారులకు హక్కు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

పెరవలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేత నిర్ణయంతో గోదావరి లంక భూములను లీజుకు తీసుకుని సాగు చేస్తున్న రైతులకు మేలు జరుగుతుందని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అన్నారు. మండలంలోని మల్లేశ్వరం గ్రామంలోని 71 మంది లంక రైతులకు శనివారం ఆయన సి క్లాస్ భూములపై ఐదేళ్ల కాలానికి లీజు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేశ్వరంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. నిడదవోలు నియోజకవర్గంలో ఈవిధంగా 1,100 మంది రైతులకు లీజు పట్టాలు జారీ చేస్తే, ఒక్క పెరవలి మండలంలోనే అలాంటి రైతులు 998 మంది ఉన్నారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం లంక రైతులకు పట్టాలు ఇవ్వకుండా పదేళ్ల పాటు ఇబ్బందులు పెట్టిందన్నారు. దాంతో సి క్లాస్ భూముల సాగుదారులు అనేక కష్టాలు పడ్డారన్నారు. గత ప్రభుత్వాలు లంక రైతులకు కేవలం ఏడాది కాలానికి మాత్రమే లీజుకు ఇస్తే, ప్రస్తుత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లకు ఒకసారి రెన్యువల్ చేసుకునేలా లీజు పట్టాలు మంజూరు చేసిందన్నారు. ఈ విధంగా మండలంలోని కాకరపర్రులో 199, కానూరులో 63, ముక్కామలలో 234, ఖండవల్లిలో 390 మంది రైతులకు సి క్లాస్ పట్టాలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఎంపీడీవో రమేష్, మల్లేశ్వరం సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, ఎంపీటీసీ సభ్యురాలు కోటిపల్లి దేవికారాణి, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి బ్రహ్మానందం, పార్టీ అధ్యక్షుడు బొలిశెట్టి పట్టాభి, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొట్టి రాంబాబు, వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**అసైన్డ్, ఈనాం భూముల సాగుదారులకు..**

నల్లజర్ల: మండలంలోని అనుమునిలంక, అనంతపల్లి, ఆవపాడు, దూబచర్ల, నల్లజర్ల గ్రామాల్లోని అసైన్డు భూముల సాగుదారులకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు చేతుల మీదుగా ప్రభుత్వం శనివారం హక్కు పత్రాలు అందజేసింది. ఈ గ్రామాల్లోని 75.50 ఎకరాల అసైన్డ్ భూములను 76 మంది రైతులు 20 ఏళ్లకు పైగా సాగు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో వారికి హక్కు పత్రాలు జారీ చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమ్మకాలు, కొనుగోలుకు అవకాశం కల్పించారు. అలాగే 110 ఎకరాల ఈనాం భూములపై 156 మంది సాగుదారులకు కూడా ఎమ్మెల్యే హక్కుపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిశోర్‌కుమార్, ఎంపీపీ బంక జయలక్ష్మి, వైస్ ఎంపీపీ అచ్యుత శివాజీ, జెడ్పీటీసీ సభ్యురాలు ముప్పిడి లక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు కారుమంచి రమేష్, పార్టీ మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సచివాలయ వ్యవస్థతో నేరుగా లబ్ధి

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- మల్లేశ్వరంలో ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన


మల్లేశ్వరంలో జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: రాష్ట్రంలో సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాక అర్హులకు సంక్షేమ పథకాలు సకాలంలో నేరుగా అందుతున్నాయని నిడదవోలు ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని మల్లేశ్వరంలో శనివారం ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.27.14 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనం, రూ.26.80 లక్షలతో నిర్మించిన హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రూ.80 లక్షల వ్యయంతో నిర్మించే వాటర్ ట్యాంక్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడారు. మల్లేశ్వరంలో ఇప్పటి వరకూ రూ.8 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. తమ హయాంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఈ గ్రామస్తుల ఖాతాలకు రూ.23 కోట్లు జమ చేశామన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌నాయుడు తన ప్రసంగంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు సాగించిన ఇసుక అక్రమాలపై ధ్వజమెత్తారు. నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నాయకులపై విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజని, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, ఎంపీడీఓ రమేష్, ఏవో మేరీ కిరణ్, సర్పంచ్ బొలిశెట్టి రత్నమాల, సొసైటీ అధ్యక్షుడు బొలిశెట్టి బ్రహ్మానందం, ఎంపీటీసీ సభ్యురాలు కోటిపల్లి దేవికారాణి తదితరులు పాల్గొన్నారు.

## 27న కొవ్వూరు మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

కొవ్వూరు: కొవ్వూరు పురపాలక సంఘ పాలకవర్గ సాధారణ సమావేశాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు చైర్ పర్సన్ బావన రత్నకుమారి శనివారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించే ఈ సమావేశంలో పట్టణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులపై సమీక్షిస్తామని, సభ్యులంతా విధిగా హాజరు కావాలని కోరారు.


## ఆయోధ్య నుంచి నల్లజర్లకు అక్షింతలు


నల్లజర్లలో అక్షింతలను దేవాలయానికి తీసుకువెళుతున్న వీహెచ్‌పీ మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్

నల్లజర్ల: అయోధ్య రామ జన్మ భూమిలో పూజిత అక్షింతలు శనివారం నల్లజర్లకు చేరుకున్నాయి. శ్రీరామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర గోరక్షక్ ప్రముఖ్ సుబ్బారాయుడు వాటిని ఇక్కడకు తీసుకువచ్చారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) మండల శాఖ అధ్యక్షుడు కందుల రవిశేఖర్ ఆధ్వర్యంలో ఈ అక్షింతలను ప్రత్యేక పూజల అనంతరం భక్తాంజేయ స్వామి ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు అల్లాడ రామకృష్ణ, ఉప ప్రముఖ్ సవలం రామకృష్ణ, వెల్లంకి రాఘవ, మద్దు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అయోధ్య శ్రీరామ మందిరం నుంచి పవిత్రమైన అక్షింతలు మండాలనికి వచ్చాయని ఆర్ ఎస్ఎస్ ఖండ కార్యవాహ్ అడ్డా శ్రీరామ్ మోహన్ తెలిపారు. తాళ్లపూడి శివాలయంలో శనివారం వాటిని భద్ర పరిచారు. తాళ్లపూడి, పోలవరం, గోపాలపురం మండలాల్లోని ప్రతి ఇంటికీ వాటిని అందజేస్తామని మోహన్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు చిరవూరి పోశి శ్రీనివాస్, చేదెళ్ల వెంకటపతిరాజు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



నిడదవోలు: పట్టణంలోని అన్నపూర్ణ నగర్ రైల్వే గేటు వద్ద శనివారం రైలు ఢీకొని గుర్తు తెలియని వృద్ధురాలు (60) మృతి చెందింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఆ వృద్ధురాలు పట్టాలు దాటుతున్న సమయంలో బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు వస్తోంది. వృద్ధురాలు గమనించకపోవడంతో ఆ రైలు ఆమెను ఢీకొంది. మృతురాలు వైలెట్ కలర్ చీర, గ్రీన్ కలర్ జాకెట్ ధరించింది. ముక్కు పుడకతో పాటు రెండు కాళ్లకు పచ్చబొట్లు ఉన్నాయి. వృద్ధురాలి మృతదేహాన్ని నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తాడేపల్లిగూడెం రైల్వే ఎస్సై ఎ.శ్రీహరిబాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసినవారు 94906 17090, 70133 60296 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై కోరారు.

## దూబచర్లలో గుండె వైద్య శిబిరం

నల్లజర్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ దూబచర్ల, విజయవాడకు చెందిన హెల్ప్ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం దూబచర్ల గ్రామంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు సుమారు 200 మందికి పరీక్షలు చేశారు. శిబిరం నిర్వాహకుడు అంబటి శ్రీనివాసరావు, క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, దుర్గా హాస్పిటల్ అధినేత బద్రి వీరశేఖరరావు, కూచిపూడి ఉదయభాస్కరరావు, పంచాయితీ కార్యదర్శి బీవీ రత్నం, చీమకుర్తి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## 134 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు

పెరవలి: పెరవలి ఐసీడీఎస్ పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో ఎంపిక చేసిన 134 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులను మెరుగుపరుస్తామని సీడీపీఓ ఎం.శ్రీలక్ష్మి తెలిపారు. ఈ మూడు మండలాల అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం శనివారం పెరవలి ఐసీడీఎస్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎంపికైన ఈ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీరు, మరుగుదొడ్లు మెరుగు పరుస్తామన్నారు. అలాగే విద్యుత్తు, భవనాల మరమ్మతులు వంటివి చేపడతారన్నారు. ఎంపికైన కేంద్రాల కార్యకర్తలు ఏయే పనులు ఏ విధంగా చేయించాలో సీడీపీవో అవగాహన కల్పించారు. జిల్లా రీసోర్స్ పర్సన్ తేజ కూడా మాట్లాడారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీహెచ్ లక్ష్మి, బాలసరస్వతి, సరోజిని, విజయకుమారి, పి నళిని పాల్గొన్నారు.

### రాజ్యాంగ రచనలో న్యాయవాదుల పాత్ర కీలకం

కొవ్వూరు: భారత రాజ్యాంగ రచనలో న్యాయవాదులు ఎంతో కీలక పాత్ర పోషించారని కొవ్వూరు జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు అన్నారు. న్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సులో భారత రాజ్యాంగం గొప్పతనం గురించి, చట్టాల గురించి న్యాయమూర్తులు వివరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.ధర్మరాజు, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జేబీటీఎస్ దేవి, ఫస్ట్ అడిషనల్ అండ్ జ్యుడీషయల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.సాయికృష్ణ, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బొబ్బా భారతి తదితరులు పాల్గొన్నారు.

### నిడదవోలులో వై ఏపీ నీడ్స్

నిడదవోలు: సంక్షేమం, అభివృద్ధి కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ముగండి కృపానందం, జిల్లా వక్ఫ్ బోర్డ్ వైస్ చైర్మన్ షేక్ వజీరుద్దీన్ అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో శనివారం జగనే ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన ప్రజా సంక్షేమాన్ని వివరించారు. జేసీఎస్ కన్వీనర్ షేక్ ఖాన్ బాషా, పార్టీ జిల్లా కార్యదర్శి మద్దిపాటి ఫణీంద్ర, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, పార్టీ పట్టణ కార్యదర్శి గాజుల రంగారావు, కౌన్సిలర్లు మద్దిపాటి నాగశ్రీ, దాకే అనిల్ కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

## వేంకటేశ్వరస్వామికి మంత్రి పూజలు


వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న హోం మంత్రి తానేటి వనిత

కొవ్వూరు: ఆరికిరేవుల గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారిని శనివారం రాత్రి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత దర్శించుకున్నారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయంలో సప్తాహం నిర్వహిస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వెళ్లిన మంత్రి వనిత స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు మంత్రికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. సర్పంచ్ మట్టా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ చావా చిన పాపారావు తదితరులు పాల్గొన్నారు.